# కధా- మణిప్పూసలు

## ఎయల్వీ రమణారావు



(గత సంచిక తరువాయి)

"కాల్లూ సేతులూ వూపుకుంటూ దిగుతాది ముసిల్ది సూస్తావుండండి"- అంటూనూ; తలావో విసురూ విసరటంతో- అస్తవ్యస్తంగా మెదులుతోన్న అసిరయ్య బుర్రలోని ఆలోచనకి- ముసిల్దాని కాళ్ళకీ చేతులకీ వుండే తాతల్నాటి వెండి కడియాల రూపం ఏర్పడింది.

శవాన్ని కదిపేదారి అదొక్కటే అని అసిరయ్య మనసులో గట్టిగా స్థిరపరుచుకుని - నిశ్చింతగా ఊపిరి తీసుకునే వేళకి - పల్లె పొలిమేరల్లో కుక్కల అరుపులు వినబడ్డవూ "బేపిలరుస్తున్నయి ... ముసిల్దాయిన్తీసుకోని పోలయగాడొస్తందు గావాల" అని ఎవరో అనడవూ, వొస్తానే ముసిల్ది చేయబోయే హడావిడి నెదుర్కోడానికి సిద్దంగా ఊరంతా ఆవేపే సూస్తోన్న షణంలో - వెంటపడి మొరుగుతోన్న కుక్కల్ని చిన్నకర్రతో గదమాయిస్తూ - మిల్ట్రీ దుస్తుల్లో - వీపున వేలాడే బరువైన సంచీతో - చేతిలో చిన్న సూట్ కేసుతో బూట్లు టకటక లాడించుకుంటో - హుందాగా చాలా ఠీవిగా నడిచొస్తోన్న ధృఢమైన ఆ ఆరున్నరడుగుల మనిషి తమకు దగ్గిరవుతున్నకొద్దీ - సంభ్రమాశ్చర్యాలతో నోరెళ్ళబెట్టి నిలుచుండిపోయింది - పల్లె మొత్తం. ఆ మనిషి తిన్నగా వొచ్చి వొచ్చి ముత్యాలమ్మ గుడిసె ముందు వాకిట్లో ఆగేవేళకి - ఆడా మొగా, పిల్లాపీచూ అతని చుట్టూ దడిగట్టేసి నిలబడిపోయి, వెర్రి మొహాలేసుకుని చూస్తూ

వుండిపోయేరే తప్ప వొక్కరంటే వొక్కరు కూడా గుర్తె పట్టలేకపోయారతన్ని. ప్రతి వొక్కర్నీ పేరు పేరునా గుర్తుపట్టిన అతను చిన్నగా నవ్వుకుంటూ - వీపున వేళ్ళాడే సంచీని తలలోంచి తప్పించి కిందకు దించి - తలకి చుట్టుకున్న మఫ్లర్ తీసి దులిపి భుజాన్వేసుకుని - తిన్నగా అపిరయ్య తాత కూర్చున్న చోటుకి వొచ్చి - బాగా వొంగుండిపోయి "నేను తాతా ... వీరేసునీ ... గుర్తుపట్టేవా..." అంటూ, మొహంలోకీ మొహం పెట్టి అడిగినప్పటిగ్గానీ —

పనీపాటులేకుండా మొకిలీసుగా వూరంతా బలాదూర్ తిరుగుతూ, అయిదేళ్ళ క్రితం చెప్పాపెట్టకుండా పారిపోయి - పటాలంలో చేరి - చాలా కాలం వరకూ జాడా జవాబూ లేకుండా పోయిన వీరేసమే ఇతగాడని పోల్చేలేకపోయారెవళ్ళూనూ.

"మన ఈరిగాడేవొరే —" గుర్తుపట్టిన ఆశ్చర్యంతో అరిచినట్టన్నారందరూ వొక్కసారిగా.

"నువ్వ్రటా యీరేసూ - పోల్తేపట్టలేపోవావుంరోరే- ఏటయిపోయావురిన్నాల్లూ-" ఆప్యాయంగా వీరేసుని చూస్తూ అడిగేడపిరయ్య.

"మిల్రటీలో చేర్నాను కదా. దేసాల్తిరుగుతున్నామ డూటీమీద. మనూర్నీ, మిమ్మల్నీ సూడాలన్దివేసింది. ఆపలా వొచ్చేసానంతే-" అన్నాడు వీరేసు.


"మా బాబు మా బాబే-" అంటూ వీరేసు వీపు నిమురుతూ ముచ్చటపడిపోయాడపిరయ్య.

"కొత్రలోజులూ - యిళ్ళకాడెవళ్ళూ వుండరు గావాలనుకుంటూ వొచ్చేను. కాని - ఏటి మీరంత ఇలా తీరుబడిగ కూచున్నారేంటీ-? ఏటయిందీ-? అన్నట్టుగ మానచ్చమ్మ పెద్దమ్మవుపడదేం-? దావొంట్లో బాగుందా?" ప్రశ్నల వర్షం కురిపిస్తున్న వీరేసుతో - "ఏబ్బెప్పమంతవుర యీరేసూ. కూకుంటే నెగనేక నెగిస్తే కూకోనేక బాగ పెద్దదాయయిపోయిందిర నచ్చమ్మ. సచ్చీకాలానికి దని కరమసూడెలగుందో- దాని దివం ఎల్లదీసే సెట్టంత కొడుకు సచ్చిపోవాడు..." అపిరయ్య ఇంకా చెప్తూనే వున్నడూ—

"ఎవుడూ ... మా రావు న్నగోడే ... వూర్లడుగెట్టగానే ఏటీ ఘోరపు వార్త..." అంటూ గాభరాగా లేచిపోయి, చుట్టూ వున్న జనాన్ని తప్పించుకుని, శవాన్నుంచిన ముంజూరు దగ్గిరకి నాలుగంగల్లో వెళ్ళి మంచున్నాడు వీరేసు - రెప్పపాటులో.

— చచ్చిపోయిన రాములు వీరేసుకి సొషెత్తూ పెద్దమ్మ కొడుకు. లచ్చమ్మ - అదే ముసిల్దాయి ఈ వీరేసుని ఆర్నెల్ల పిల్లడప్పుడు చెల్లెలు సచ్చిపోతే తీసుకొచ్చుకుని తన కొడుకుతోపాటు సాకింది. చచ్చిపోయిన ఈ రాములు కూడా వీరేసుని స్వంత తమ్ముడిలాగే చూసుకు నభిమానించేవాడు. వీరేసు చేసే ఆగడాలకీ, పీకల మీదకి తీసుకొచ్చే అల్లర్లకీ, రాములయితే సహించి కడుపులో పెట్టుకునేవాడు గాని - ముసిల్దే సరిపెట్టుకోలేకపోయేది. తేరగా తిని కూర్చుంటూ చెల్లెలి కొడుకు మితిమీరి చేసే అల్లర్లని భరాయించలేక - ముసిల్దే వోరోజున కేకలేసి, నానా గొడవా చేసి బైటికి పొమ్మని కసిరేస్తే - ఈ వీరేసుకి పౌరుషం పొడుచుకొచ్చి ఆ పోవడం పోవడం తిన్నగా విశాఖపట్నం పోయి మిలటరీలో చేరిపోయాడు. ఆ కోపంలో చాలాకాలం వరకూ తన సంగతే తెలియపరచలేదు. ముసిల్దానికి వోరోజున మనియార్డరు వొచ్చినప్పుడు పల్లెలో అందరికీ తెలిసింది పటాలంలో చేరేడనీ. ఆ తర్వాత - ఇదుగో ఇదే రావడం. వీరేసుకి గతం అంతా కళ్ళముందు గిర్రున తిరిగింది - వొక్కక్షణం. రాయిలా బలిష్ఠంగా వుండే రాములన్న రూపం కళ్ళక్కట్టి - ఎదురుగ్గా శవాన్ని చూసేసరికి - ఆ పోలికే దొరక్క - గుండెల్లోంచీ దుఃఖం కమ్ముకొచ్చీ డంతో - మడిగాళ్ళమీద శవం ముందు కూలబడిపోయి - నెత్తిన వున్న టోపీ తీసి - రెండు చేతుల్లోనూ మొహాన్ని దాచుకుని - మిలటరీ పద్ధతిలో - నిశ్శబ్దంగా దుఃఖపడ్డాడు- వీరేసు.

వీరేసు ఇల్లొదిలి వెళ్ళిపోయిన ఏడాది చివర్లో రాములికి పెళ్ళయి, ముత్యాలమ్మ కాపరానికి రావడం మూలాన - ఫలానా అని వినడమే కాని మరిదిని చూసిందిలేదు ముత్యాలమ్మ. అలాటిది - అతన్ని




చూట్టం తటస్థించడంతో - తదేకంగా అతని వేపే చూస్తూ వుండిపోయిన ముత్యాల్మని హెచ్చరిస్తున్నట్టు — "మీ యత్తకి సెల్లెలు కొడుకే ముత్తేలమ్మ. రగత సమ్మందం యిడుచుకొచ్చీనాది దూరాబారం నుంచి—" అంటూ గంగమ్మ తన కర్తవ్యం గుర్తుచేసే సరికి - వచ్చిన ముణుకుల్లో తలదూర్చుకుని ఖావురు మంది - ముత్యాలమ్మ.

'వదిన' అని గ్రహించేడు వీరేసు. పెళ్ళి మాపులు కెళ్ళొచ్చి - 'సుక్కలా వుంది పిల్ల- సూడ్డానికి రెండు కల్లూ సాలవు' అంటూ అప్పట్లో పెద్దమ్మ కాబోయే కోడలి గురించి అందరితోనూ చెప్తుకు మురిసిపోవడం - గుర్తొచ్చింది వీరేసుకి. 'మాడతగ్గ మనిషిని' ఇలాటి పరిస్థితిలో మాడవలిసి వొచ్చినందుకూ; వో మాట వోదార్పుగా అనటానికయినా అసలు పరిచయమే లేకపోయినందుకూ- ఇరకాటంలో పడ్డ వీరేసుక్షణంసేపు తటపటాయించి — "మా పెద్దమ్మేదీ-" అనడిగాడు చివరకి - గంగమ్మని.

"మీ యప్పకాడకెల్లింది—" అంది గంగమ్మ.

అన్నకిలా వుంటే పెద్దమ్మ కూతురి దగ్గిరకు ఎందుకు వెళ్ళిందో అర్థం కాలేదు వీరేసుకి — "కబురెట్నేదా—?" అనడిగేడు.

"నిన్నరేతిరి కాడే మనిసెత్తోలిసినాం...గడియో సిటవోరావాల...దనికోసరవే సెవాన్నల గుంచీసి సూస్తన్నం మావంతా—" గంగమ్మ చెప్తోంది. వింటూ. శవాన్ని మళ్ళీ పరీక్షగా చూసేడు వీరేసు. శవం ముక్కుమ్మటా, కళ్ళమ్మటా చీవూ నీళ్ళూ కలగాపులగంగా కారుతున్నాయి. చాలా కాలంగా శరీరం జబ్బుతో వుండటాన్న - బొంది పొల్లపందులా చితికిపోయి, సన్నగా కంపుకొట్టడం ప్రారంభించిందప్పుడే. అరిచేతులూ, అరిపాదాలూ తెల్లగా న్రెరలు తేలి విచ్చిపోతున్నట్టున్నాయి. వేళ్ళ చివర్ల నుంచీ మొదలై వొళ్ళంతా క్రమంగా నీలబడిపోతోంది. శవం కింద నుంచీ పుట్టలకి పుట్టలు చీమలు పాకురుకొస్తున్నాయి. శవం పాడయిపోవడం మొదలై చాలాసేపైందన్న సంగతి క్షణాల్లో పసిగట్టిన వీరేసు -

"ఆలీశవయితే మరినాబం లేదు - సెవాన్ని బేగి దావ పరిసీయాల తాతా-" అన్నాడు అపిరయ్య దగ్గరకి పరి గెత్తుకొచ్చి.


"సూపుల్దక్కే రుణం వుంటే పెద్దమ్మ ఆ టయం కొస్తాది - లేపోతే లేదెట్టేస్తాం - ఇంకే మాత్తరం ఆలీశంచేసినా శవాన్నెత్తడవే కష్టం" మళ్ళీ వీరేసే అన్నా- తిరిగి అనటానికి తన దగ్గిర సరైన మాటేదీ లేక మిడుతూ మిడుతూ చూస్తూ కూర్చున్న అపిరయ్య ఆంతర్యం ఏవిటో అర్థంగాక - "ఇంకేటాలోచన తాతా- ?" వీరేసే మళ్ళీరెట్టించి అడగేసరికి—

"ఆలోసనకేటుందిర మనవడా - నువ్వేం పైయ్యోడివీ పరాయోడివీ కాదు గద - కావలసినోడివి రావాల్సిన ఏళకే వొచ్చినవు - సెప్పడానికేటి తకర్నేదుగానీ-" అంటూ, అసలు సంగతి చెప్పడానికి సరైన మాట కుదరక అపిరయ్య నానుస్తూంటే - మాటందుకున్న సింహాద్రి -

"ఇంకా ఆ నామ్వడెందుకుర తాతా ... నేను సెపుతాను ఇను మేనల్లుడా ... సెవాన్నెత్తడానికి ఎవుల్ల గ్గిరా ఏగాన్దబ్బుల్లేన్కా, మీ బావకాణ్ణించేటయినొట్టుకుని మీ పెద్దమ్మొస్తాదేవోనీ దిక్కుల్చూస్తా కూకుదువ్నాం అందరవీనీ—" విషయం విడమరచి చెప్పినప్పటిగ్గాని వాళ్ళ తాత్పారం దేనికో అర్థం అయింది కాదు వీరేసుకి. చిన్నతనం నుంచీ తనెరిగిన గర్భదరిద్రం ఆ పల్లెనింకా అంటిపెట్టుకునే వుందన్న సంగతి విశ్వరూపంలా గోచరించి "ఆ బెంగేట్నేదింక నెగండి - ఎంత కర్సయినా తకర్నేదు - ఇంకేటాలోసించకుండ - ఏటికీ నోటు పెయ్యకుండ - మన పద్దతులెలగుంటే అలాగ - ఆ ఏర్పాట్లన్నీ సప్పున కానీయండి - మావా ఇదుగో యీ మూడొందలూ మీ కాదుంచి ఆ కరుసంతా సూడండి - సాలప్పోతే మొగమాట పేట్నేదు - అడగండి - ఎంత కర్సయిన పర్నేదు - దహనం గనంగ జరగాల ..." అంటూ సప్పున నోనిర్ణయం తీసుకోడవే గాకుండ - చకచక దాన్ని అమలుచేయిస్తున్న వీరేసుని సూసి - పల్లె మొత్తం అవాక్కయిపోయింది.

"ఆ కులుమావానికి నీ రునం ఇలగ పెల్లిస్తున్నవుర మనవడా-" కళ్ళు తడిచేసుకుంటూ అన్న అపిరయ్య ఆర్ద్రతని పల్లె అంతా పంచుకుంది.

-అక్కడితో ఆ పల్లెలో ప్రారంభమైన చైతన్యం క్షణాల మీద కోలాహలంగా పరిణమించింది. కేకలు-అరుపులు-తప్పెట్లు-తాళాలు- తాగుళ్ళు-తందనాలు. చావులు కాదు-రంగ రంగ వైభోగంలా హరహరహర మంటూ నాలుగు భుజాల మీంచీ లేచిన పచ్చ బద్దల పల్లకీ- ఊరంతా ఊరేగి చెరువు కొమ్ము ఎక్కింది. ఆ పల్లెకి పట్టిన జడత్వం పూర్తిగా వొదిలి పోయేలా డప్పులు-తారస్థాయిలో మోగుతున్నాయి. శవానికి పీకల్దాకా చెప్పటి కర్రలు. మగాళ్ళ గొంతుల మొయ్యా సారా కాయలు. ముట్టించగానే భగభగమంటూ ఆకాశాన్నంటింది చితి. నోళ్ళెరక్కుండా తాగిన వాళ్ళ ఒళ్ళు తెలీని పేలుళ్ళు. చెరువులో పల్లె పల్లె అంతా స్నానాలు. రాళ్ళ పొయ్యిల మీద వంటలు. జన్మానికో శివరాత్రిలా-వాళ్ళ బ్రతుకుల్లో వుడుకులెత్తే వేడి వేడి వరి కూడు... జిహ్వ ఎక్కడుందో వెతికి పట్టుకున్న ముక్కల పులుసు. ఆడ, మగా, పిల్లా పీచు ఒకటే హడావిడి. పంక్తి భోజనాలతో వూరంతా పండగొచ్చినట్టు ఒకటే సంరంభం. వాళ్ళా పై తెలీని ఆ గందర గోళపు ముగింపు ఘట్టంలో- "కొడుకో-ఓరి నా కొడుకో-" అంటో గగ్గోలు పెట్టేస్తూ, కడుపు బాదుకుంటూ దిగింది ముసిల్ది. ఇంకెక్కడి కొడుకు? పంచ భూతాల్లో కలిసి పోయాడు. "నా కొడుకులేని వూర్ల నేనడుగు పెట్టలేనర తండ్రులారా-ఆడిసితిలో నన్నూ తోయిప్పి ఇంత బూడిదసేసేయండ్రి బాబుల్లారా-" అంటూ కొడుకు చితి ముందు నుంచి- ఎవరెంత చెప్పినా కదలకుండా మొరాయించుక్కూర్చున్న ముసిల్దాన్ని రెండు చేతుల్తోనూ ఎత్తుకుని తీసుకెళ్ళి ఇంట్లో కూర్చోబెట్టి రాములి కొడుకుని తీసుకొచ్చి వాళ్ళో వేసి- "నీ కొడుకెళ్ళి పోతూ ఆడి కొడుకు న్నీ కప్పచెప్పిపోనాడే పెద్దమ్మా" అన్నాడు వీరేసు. ఆ ముక్కకి-ముసిల్ది మొహం పక్కకు తిప్పు




కుంది. అక్కడికి చాలా దూరంలోనే కూర్చున్నా-వొక్క ముత్యాలదేవ్ ఆ సంగతి కని పెట్టింది-!

** ** ** **

పెద్ద దినం కూడా అంత ఆర్భాటంగానూ జరిపించేడు వీరేసు. ఆ పల్లెలో ఇటీవల కాలంలో ఎవరి చావ్వ అంత వైభోగంగా జరగలేదు. అప్పటిగ్గాని ఆ సంరంభంలో నించి తేరుకోనేలేదు పల్లె మొత్తం. ఆ హడావిడి సద్దుమణిగిన మరునాడు ముత్యాలమ్మ గుడిసె ముంజూరు కిందా, వాకిట్లోనూ ఊరంతా చేరి జరిగిన సంఘటనకి ముక్తాయింపిస్తున్న ఆ శీతకాల మిట్టమధ్యాహ్నపు వేళ-అప్పుడూ-అప్పుడు ప్రారంభమయింది అసలు కథ! అదీ-బ్రతుకు కథ!! బ్రతుకు మీది తీపి కథ!!!

"మాయిరేసున్నోడు తీసుకోని నాను నా కూతురు కాడకీ రోజెల్లి పోతున్నాను పెద్దయ్యా-" అపిరయ్యతో అత్త అంటున్న ఆ ముక్క చెవినిపడి పక్కలో బాంబు పేలినట్టు తుళ్ళిపడింది ముత్యాలమ్మ. అపిరయ్యతో పాటు వూరంతా ఆశ్చర్యపోయింది. ఏవీ కానిది వీరేసు వొక్కడే.

"కోడలి మాట ఏటి సెప్పినావే నన్నమ్మయితే-" కుల పెద్దగా-అడగవలసిన ముక్క అడిగేడు-అపిరయ్య తాత.

"కాటికి కాళ్లు సాపుక్కూకుదున్నదాన్ని నానేటి సెప్తానూ-" ముసిల్ది అంటూంటే అపిరయ్యకేదో గుర్తొచ్చి ముసిల్దాని కాళ్ళ వంకా చేతుల వంకా సూసేదు. ఇంతింతలావున అంతంత లేసి వెండి కడియా లుండవలసిన చోట ఈ మధ్యనే వూడ గొట్టించేసినట్లు తెల్లటి చారలు స్పష్టంగా అవపిస్తున్నాయి. ముసిల్దాని వొడివాటు తనానికి ముక్కున వేలేసుకుంటూ-

"అళ్ళకి నివ్వు తప్పఇంక దిక్కెవురున్నారే-? నీ దారి నువ్వు సూసుకు నెల్లిపోతే బొడ్డూడని గుంటడితో అదే గోతిలపడాలే-?" అనడిగాడు.

"నాకళ్ళ దిక్కు మీద బతుకెల్ల బెట్టుకోయాల్సిన దాన్ని...... నా నాకలకి దిక్కేటి-"

" ఆ గుంటడెదిగిందాకయిన కోడలికి తోడుంటె. కాదే-నిన్నేటి రాళ్ళు మొయ్యాలా గుళ్ళు మొయ్యాలా-"

-చూడగా చూడగా ఈ రొంపి అంతా తన మెడకి తగిలించాలని చూస్తున్నారు వీళ్ళంతా ఏకమై-అనుకుని

# ఓ క్షణం

నీకూ నాకూ మధ్య
విలువెత్తు నిశ్శబ్దం
పెదవి కదిలితే
పొగమంచు చెదిరినట్లు—
ప్రేమ—,
కాకుంటే,
మాటలు మౌన రూపం దాల్చినట్లు—
భ్రమ—,
హృదయాల సముద్ర గర్భాల్లో
పరుగెదుతున్న,
అలజడుల, అహంకారాల, అవమానాల
అల్లరుల జలాంతర్గాములెన్నో?—,
పట్టుబడితే యుద్ధం—,
లేకుంటే,
జలసమాధిలో నిశ్శబ్దం
నీకూ నాకూ మధ్య
గాలి కదిలినా
ఉలికిపడే ఉద్వేగం
రాలిపడే ఒక్క అశ్రుకణం కోసం
వేచి చూస్తున్న క్షణం—

—ఇంద్రగంటి జానకీబాల

గాబరా పడి పోయింది ముసిల్ది. అల్లుడింట్లో మూడు పూటలా తినడానికింత తిండీ, ముప్పొద్దులా కంటికింత వెచ్చటి నిద్రా మరిగిన జరుగుబాటుని వొదులు కోడం ఏ మాత్రం రుచించలేదు ముసిల్దానికి. పైగా-ఇక్కడికి బయలుదేరి వొచ్చే ముందు పెద్ద దినం అయీ అవగానే బయల్లేరొచ్చీమని- కూతురు మరీ మరీ చెప్పి పంపింది. అల్లుడూ ఆ మాటే అన్నాడు. ముందూ వెనకా వాళ్ళకి ఎవళ్ళూ లేరు. అన్నానికి లోటు లేదు. కనుక్కున్న కూతూరు కాబట్టి అభిమానానికి అంతకన్నా లోటు లేదు. అవసాన దినాల్లో ఏ మనిషికయినా ఆ మాత్రం భరోసా వుంటే ఇకనేం. అంచేత-ఎవళ్ళేం చెప్పినా పపే మిరా వినిపించుకోకూడదని ఖచ్చితంగా భీష్మించుక్కూచున్న ముసిల్ది- "సావటానికి సిద్దంగున్న నాను తోడేటి-" పాతపాటే పాడింది.

"వొయసులో వున్న ఆడకూతుర్ని గాలికొగ్గేసి నీ దారి నువ్వు సూసుకునెల్లి పోడం అంత సబువుకాదొలే-" గంగమ్మ కల్పించుకుంటూ అంది.

"వొయసులో వుంది గనకే దాని బతుక్కేటి డోకానేదని సెప్తన్నానే నానూను-"ముసిల్ది అంతమాటా అనగానే-అంతవరకూ మునుకుల్లో తల దూర్చుకుని జరుగుతున్నదంతా మౌనంగా వింటోన్న ముత్యాలమ్మ ఢివాల్న తల పైకెత్తి అత్తవంక చూడ్డంలో బరువయిన ఆమె జుట్టు ముడి వీడి వొంపులు తిరిగిన ఆమె భుజాల మీంచి పట్టుకుచ్చులా జారి వీపంతా మెత్తగా పరుచు కుంది. ఆ క్షణంలో-దారితో ఒక మబ్బుల్లో చిక్కుపడ్డ పున్నమి చందమామలా వుందామె.

"నువ్వలగనడం నోకరీతి కాదేనవ్వమ్మా......" నవ్వ చెప్పబోతున్న అసిరయ్య మాట వద్దేస్తూ-

"ఈ నోక రీతుల్లాకేటి కూడెట్టవు. నాకేటే సబవు ల్చెప్పకండి నాయన్లారా. నాకీతంట సాలేటి తగిలించ కండి బాబుల్లారా మీకు పున్నెం వుంటాది. నన్నొగ్గీయండి నా మానాన బతికిన్నాల్రోజులు నా కూతురి కాడ నన్ను దినవెల్లదీసుకోనీయండి-మీకు దణ్ణవెడతాను"- అంటూ- తన బతుకు దారిని అంత కఠినంగా నిశ్చయించేసుకుని-తెగేసి అంత ఖచ్చితంగా తన నిర్ణయాన్ని చెప్పేసిన అత్తమాటలు విన్న ముత్యాలమ్మకి రేపట్నుంచి తన బతుకేవిటో అర్థంగాక వొల్లుమంది. అందరి హృదయాల్నీ కదిలించిన ఆ ఏడుపు ముసిల్దాని చెవి కెక్కలేదు.

"ఏట్రా యీరేసూ బెల్లం కొట్టిన రాయిలా అలా సూత్తూ కూకున్నావు- మీ పెద్దమ్మకో ముక్కైనా సెప్పరాదురా-" అసిరయ్య అడిగేసరికి-

"ఆడేటి సెప్తాడు నాకు. అయినా ఆడి బతుకాడొగ్గేసుకోని మీకూ మీకూ సబువుల్చెప్పొస్తా కూకుంటాడేటి టెక్కుడాడు. సెగరాయీరేసు సెగు.మీ యిప్పకాడ నన్ను దింపేసి అంగ నువ్వెల్లి పోదువుగాన్లేగరా-" అంటూ చర్రున లేచి పోయింది. మూట వంకని బెట్టుకుంటూ. పెద్దమ్మ మాట విని మౌనంగా లేచి నిలబడ్డ వీరేసుని చూసి- 'ఆ పెద్దమ్మకి తగిన కొడుకే. అసలుకే మిలట్రీవోడు' అనుకున్న అసిరయ్య- "దన్ని దిక్కుమాలి న్దాన్నేసేసెల్లిపోతార్రా మీరయితే-" పైకి అన్నాడు బాధగా.

"అదెందుకు దిక్కుమాలిన్దయిందీ? ఇదివూరే గాని అడివి కాదుగద- మీరంతా నేరా? సూడరా?-" అంది ముసిల్ది.

"అయినోల్లు మీరంతాగ్గెసెలిపోండి మావు సూత్తం. మాకేటంత బాద పట్టిందోలమ్మ. దనికేదన్నా దార్సూపింవెత్తే ఎల్లండి. నేపోతే నేదు. మాం సూత్తావన్నదీ మామాత్తరం ఏటెట్టుకోకండి. మాకేటి సమ్మందం నేదు గాకనేదు-" అంటూ లేచి పోయింది గంగమ్మ.

"ఏటసమ్మందం వుందని నాకు నోకరీతులెప్పుదాని కొచ్చివారే మీరంత? అలగే దనికీ సెప్పండే నోకరీ తెలగుందో-నలుగురూ నడుసుకునేదారేటోనూ-" ఎంత నర్మగర్భంగా ముసిల్దాముక్క అన్నా-అరటి పండొలిచినట్టు వగతమై పోయిందందరికీ. అది రివాజే. షింత రివా జయినా అంత వేగం అనవలసిందీ కాదు. అంత సులువుగా అసలు జరిగేదీ కాదు. అంచేతే-

"కొడుకు సచ్చిపద్దినాలు కాలేదు-కోడలికి మారు మనువు సెప్తంది ముసిల్దాయి-సూడంద్ర సిత్ర వెల గుందో. మనకి బుద్దినేక వొచ్చినం. నెగుమావా. ఆల్లకర్మేదో ఆల్లే పడతారు. మనకేటి మద్దిన ఈ తంటా-" గంగమ్మకి రిమ్మెత్తుకొచ్చి దులిపేసింది.

"వోల్లగ్గే ఎప్పటికయినా జరిగేదదేనే. అప్పుడు మల్లా మీరే వొచ్చి సెప్తారే ఆ సబువూను. అయినా తెలకదుగుతున్నామా- మొగుడు బతికుండగానే మనువులికి మనువులెల్లగాలేందీ-మొగుడు సచ్చేక మారు మనువెల్లడవో యిద్దారం నాగ సెప్తన్నావేటోలె గంగమ్మా" గంగమ్మ మూడు మనువులకెళ్ళొచ్చిన సంగతి బాగా తెలిసిన ముసిల్ది గంగమ్మని చెరిగేసొదిలేసింది.

"మారుమనువేదో కోడలిక్కుదిర్చే ఎల్లాదా-" మాటాడ్డంలో గంగమ్మా ఏం తక్కువ తినలేదు.

"కుదిర్చేసి-ఆల్లసేత అప్పుడు సీ అని గెంటించుకెల్లి పోడానికి నాకేటంత గేచారం పట్టనేదొలే. వొవులి ఏకుదర్చక్కర్నేదూ. అదేటి అడ్డాల్లో పిల్లా? దని బతుకదిసూసుకోనేదా? అయినా తలుసుకుంటే మారు మనువేం బెమ్మ పయత్నం కాదు-" కరాకండిగా ముసిల్ది తేల్చి చెప్పేయటంతో-ముత్యాలమ్మకి చర్చ అంతా

# 'ప్ర'పంచ పదులు


3

తెగిన రెక్క కోరుతుంది గగన స్పర్శ.
ఎతి గొంతుక పాడుతుంది జీవిత భాష.
కడదాకా పోరాడే క్రాంతిశీలికి-
సుడిగాలిగ మారుతుంది ఆఖరిశ్వాస.
అడివి కత్తి మారుతుంది ఆగ్రహఘోష.

4

గాలి విసరబోకు ఒళ్ళు కాలుకుపోతుంది
జాలిమాపబోకు గుండె మూసుకుపోతుంది.
ఏ చేతికి గాయమని ఎందుకడుగుతారో?
ఏ చేయైతేమి రాత రాసుకు పోతుంది
కాలాన్నే తన నీడగ తీసుకుపోతుంది.

డాక్టర్ సి. నారాయణరెడ్డి



వెగటుగా తోచింది. కానీ కాదనుకోడానికి వీల్లేదు.

'బ్రతుకు' గురించిన చర్చ అది. సాంఘిక జీవనంలో తప్పనిసరి-ఆ చర్చ 'చావు' కనపడని దేవుడి చేతిలోనూ, బ్రతుకు చుట్టూ వుండే సంఘం చేతిలోనూ నిర్దేశమై వుంటుంది. అసిరయ్య ఆదాలోచించే-

"అత్తవీ, అయిన్దానివి ఆదుకోయాల్సినదానివి- నువ్వల గనీడం దరమం కాదే. మల్లోసుటాలోసించే-" మళ్ళీ బ్రతిమాలేడు.

"నాకేటి దరమాల్సెప్పకండి. ఆలోసించే దేట్నేదు. ఎవ్వరెన్ని సెప్పినా నావోసిటం వుండేది నేదిక్కడ. పదరా యీరేసూ. బేగెల్లిపోతే మల్ల బస్సుందక కవుకు లోడి పోవాల పద పద-" అంటూ, కఱ్ఱ టకటక

లాడించుకుంటూ వాకిట్లో కొచ్చేసింది ముసిల్ది. పెద్దమ్మ వెనకాలే వీరేసూ బైట కొచ్చేసేడు. ఈ విడ్డూరం చూడ్డానికి పల్లె మొత్తం ముత్యాలమ్మ వాకిట్లోకొచ్చి నిలబడింది.

బ్రతుకు మీద 'తీపి' అంతటిది 'బ్రతకడం' కోసం మనిషి పరుగు అంతటిది. ఊరు ఊరంతా ఎదురుగ్గా నిలబడ్డా జంకూ గొంకూ లేకుండా- చెల్లెలు కొడుకూ కొండంత అండగా తన వెనకొస్తున్నడన్న ధైర్యంతో - ముసిల్ది ముందుకు అడుగెయ్య బోతున్న క్షణంలో--

"పోలయ్య మావా-పెద్దమ్మని జేగర్తగ తీసుకెళ్ళి వాల్లా పురంలో మా అప్పకాడికి దిగబెట్టేసొచ్చి-" వ్యయంగా చెల్లెలి కొడుకు వీరేసు అంటోన్న మాటలు ముసిల్దానికి పక్కలో బాంబులు పడ్డట్టు వినపడి- బుఱ్ఱ తిరిగి 'కలా? నిజమా?' అన్న సంశయంలో పడి- తేల్చుకోడానికని వెనక్కి తిరిగిన వేళకి--

పోలయ్య చేతికి దారి ఖర్చులికి డబ్బు ఇస్తూ పురమాయిస్తున్న వీరేసు కనిపించేసరికి-ఇంకా అను మానం తీరక-

"నువ్వు రావేట్రనాతో-" కళ్ళు చికిలించుకు చూస్తూ అడిగింది. - దగ్గిర కొచ్చి నిలబడ్డ వీరేసుని.

"రాటం నేదే-ఇదుగో ఈ ఇరవై నీకాడుంచుకో- ఈ ఇరవై అప్పకిచ్చి-" అన్న వీరేసుని ఎగాదిగా చూస్తూ-

"నువ్వు మల్లా పటాలంలోకి ఎలక్కర్నేదట్రా-" అనడిగింది.

"ఎల్లాల్నే-"

"మరైతే వొచ్చిరాదా- మీ యప్పకాడ కూడా నా రోజులుండల గెలిపోదువు-" ఇంకా వొదల్లేదు ముసిల్ది.

"ఇప్పుడు కాదునే- మల్లీ పాలొచ్చినప్పుడు తప్పకొస్తా నన్నానెప్పు అప్పతో. నువ్వెల్లు బస్పుందదు 'మల్లా-" తేల్చేసేడు వీరేసు.

ముసిల్దానికి నోట మాటరాలేదు. వెళ్ళటానికి వొకం తట అడుగూ పడలేదు.

ఊహించని ఈ మలుపుకి పల్లె బిత్తర పోయి చూస్తోంది.

"పద నచ్చమప్పా-" అంటూ పోలయ్య చేతిలో మూటందుకుని ముందుకు నడవటంతో ముసిల్దానికి ముందుకి నడవక తప్పలేదు. ఇలా నాలుగడుగులేసిందో

## మే 4వ తేదీ చలం వర్ధంతి

# మల్లెపూలు


చలం

మల్లెపూలు, తెల్లని
మల్లెపూలు, ఎవ్వని
మల్లెపూలు!
(ఆ పరిమళం నాకిచ్చే సందేశం యే మాటంతో
తెలుపగలను!)
సాయంత్రాలు స్నేహానికి వల్లని శాంతినిచ్చే
మల్లెపూలు
అర్ధరాత్రులు ఎవ్వి జుట్టు పరిమళంతో కలిసి
నిద్రలేపే రక్తాన్ని ఎందులు తొక్కించే మల్లెపూలు
వొళ్ళు మధ్య వేతుల మధ్య నలిగి నశించిన పిచ్చి
మల్లెపూలు
రోషాలూ నవ్వులూ తీవ్రమైన కోర్కెంతో
తపించి వాడిపోయిన పెద్ద మల్లెపూలు
సన్నని వెన్నెట్లో ప్రియురాలి నుదుటి
కన్నతెల్లగా- పిచ్చి! యేమి చెయ్యాలో తేలీని
ఆనందంతో గుండె పట్టి చీలికలు వేసే
మల్లెపూలు
తెల్లారకట్ట లేచి చూసినా
ఇంకా కొత్త పరిమళాలతో, రాత్రి జ్ఞాపకాలతో
ప్రశ్నించే మల్లెపూలు
ఒక్క స్వర్గంలో తప్ప ఇలాంటి వెలుగు తెలుపు
లేదేమో అనిపించే మల్లెపూలు
అలిసి నిద్రించే రసికత్వానికి నవజీవనమిచ్చే
ఉదయపు పూలు
రాత్రి సుందర స్వప్నానికి సాక్షులుగా
అవి మాత్రమే మిగిలిన నా ఆప్తులు మల్లెపూలు

—చెలం

[సేకరణ: ఎల్. భూదేశ్వరరావ్;
చెలం- మ్యూజింగ్స్
పేజీలు 161, 162]

లేదో--

"అసిరయు తాతా రేపటెల్లుటల్లో మాంచి మూర్తం నోటి సూడుమీ-" అన్న వీరేసు మాటలు పిడుగుల్లా వినబడ్డాయి.

"మూర్తం దేనికిర మనవడ" అసిరయ్య అడిగాడేం అర్థం గాక.

"మారుమనువుకి-"

"సూడ్డానికేట్నే. ఈ మారగశిరంలో ఏరోజైనా మూర్తమేర మనవఢా. ఇంతకీ దన్ని సేసుకునేవోడేడి ఇంత అరిజెంటుగ-"

"ఇంకెవరు తాతా-నేనే-"

స్పష్టంగా, జంకేం లేకుండ, ఖడీగా వీరేసు తన నిర్ణయం చెప్పేసరికి-

మందంగా అడుగేస్తోన్న ముసిల్దానికి మతి పోయి, వెన్నులోంచి చలి పుట్టేని, అడుగెయ్యలేక వెనక్కి తిరిగి చూసేసరికి రాముల కొడుకు నెత్తుకుని ఆకాశం అంతెత్తు ఎదిగిపోయి నిల్చున్న వీరేసు కళ్ళ పడ్డాడు.

తనేం విన్నదో-వినగానే తనకేం జరిగిందో- అది సంతోషమో- దుఃఖమో 'ఇదీ' అని నిర్వచించుకోలేని అయోమయ స్థితిలో ముత్యాలమ్మ వీరేసుని తదేకంగా చూస్తూ వుండి పోవటంలో రెప్పవెయ్యటం మరిచి పోయిన అంతంతలేసి ఆమె కళ్ళల్లో నీళ్ళు ముత్యాలై నిలబడి పోయాయి.

పక్క వూళ్ళో పెళ్ళిక్కాబోలు పల్లకీని తీసుకని సన్నాయి మేళం చెరువు గట్టమ్మట సాగి పోతోంది.

ఆ సన్నాయి వాయిద్యంతో తెలివొచ్చిన ముసిల్దానికి అడుగు పడింది ముందుకి.

ముసిల్దాన్ని ఆగమనటానికి పల్లెకి నోరు రాలేదు.

అలాగే- అచంచలమైన తన నిర్ణయంతో-అందరి మధ్యా అంతెత్తు ఎదిగి నిలబడ్డ వీరేసుని- అభినందించ టానికి- ఆ పల్లె జనం దగ్గిర ఆ రకం భాషే లేదు !!!